# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-07-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **బ్రిటిష్ కాలం నాటి చట్టాల స్థానంలో కేంద్రం ప్రవేశపెట్టిన మూడు నూతన నేర, న్యాయ చట్టాలు ఈరోజు నుండి దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చాయి.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ భరోసా కింద పెంచిన సామాజిక పింఛన్లను రాష్ట్రప్రభుత్వం ఈరోజు పంపిణీ చేస్తుంది.**
3. **విశాఖపట్నం నుంచే మహిళలల ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభిస్తామని ఆంధ్రప్రదేశ్ రవాణాశాఖ మంత్రి రామ్ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు.**
4. **కేంద్రం విభజన హామీల అమలు చేసేలా రెండు తెలుగు రాష్ట్రాలు కలిసి కృషి చేయాలని తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.**
5. **దేశవ్యాప్తంగ ఈ రోజు జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహిస్తున్నారు.**
6. **ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రానున్న రెండురోజులపాటు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ శాఖ తెలిపింది.**

==========================

బ్రిటిష్ వలస పాలన నాటి చట్టాలను ప్రక్షాళన చేస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు నూతన నేర ...., న్యాయ చట్టాలు ఈరోజు నుండి దేశ వ్యాప్తంగా అమలులోకి వచ్చాయి. భారతీయ న్యాయ సంహిత , భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం అనే ఈ మూడు నూతన చట్టాలు దేశంలోని క్రిమినల్ న్యాయ వ్యవస్థకు అత్యంత కీలకమని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ చట్టాలను 2023 డిసెంబర్‌లో భారత పార్లమెంటు ఆమోదించింది. అదే నెలలో ఈ మూడు చట్టాలు రాష్ట్రపతి ఆమోదం పొందినప్పటికీ కేంద్ర ప్రభుత్వం వాటి అమలును వాయిదా వేయడంతో అవి అమలులోకి రాలేదు. దేశ న్యాయ వ్యవస్థను మరింత పరిపుష్టం చేసే ఈ మూడు చట్టాలు జూలై ఒకటవ తేదీ నుండి అమలులోకి వచ్చేలా కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ కొత్త చట్టాల ద్వారా బ్రిటిష్ కాలం నాటి చట్టాలను సమూలంగా మారుస్తూ భారత దేశ సార్వభౌమత్వం, ఐక్యత, సమగ్రతకు వ్యతిరేకంగా చేసే వేర్పాటు వాదం, వేర్పాటు వాద తిరుగుబాటు, ఉగ్రవాదం వంటి నేరపూరిత చర్యలను కఠినంగా శిక్షించే నిబంధన ప్రవేశ పెట్టారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు ఎన్టీఆర్ భరోసా కింద పెంచిన సామాజిక పింఛన్లను రాష్ట్రప్రభుత్వం పంపిణీ

చేస్తుంది. ఇందులో భాగంగా గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలోని పెనుమాకలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా పింఛన్లను పంపిణీ చేశారు. కాగా... ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా వార్డు, గ్రామ సచివాలయ సిబ్బందితో పింఛన్లను పంపిణీ చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. పెరిగిన పింఛన్ 4 వేల రూపాయలతో పాటు, ఏప్రిల్ నుంచి మూడు నెలలకు కలిపి ఈ రోజు 7 వేల రూపాయలు లబ్ధిదారులకు అందించనున్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పింఛను పెంపును తొలి నెల నుంచే అమలు చేస్తున్నామని ప్రభుత్వం తెలిపింది. ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా 65.31 లక్షల మందికి పింఛన్లను పంపిణీ చేయనున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ఈరోజు నుంచి ఆయన శాసనసభ్యులుగా ఎన్నికైన కాకినాడ జిల్లాలోని పిఠాపురం నియోజకవర్గంలో పర్యటిస్తారని అధికారులు తెలిపారు. మూడు రోజులపాటు నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన కొనసాగనుంది. పర్యటనలో భాగంగా పిఠాపురంతోపాటు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. గొల్లప్రోలులో పింఛన్ పంపిణీ కార్యక్రమంలోనూ పాల్గొంటారు. అనంతరం అధికారులతో నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షిస్తారు. అనంతరం చేబ్రోలు చేరుకుని జనసేన పార్లమెంట్ సభ్యులు, శాసనసభ సభ్యులతో పవన్ కల్యాణ్ సమావేశం అవుతారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం నుంచే మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభిస్తామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రామ్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. నిన్న విశాఖపట్నంలో ఆంధ్ర ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్లను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఉచిత బస్సు పథకం అమలు చేస్తున్న తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో పర్యటించి అధ్యయనం చేస్తామన్నారు. గత ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో పూర్తిగా విలీనం చేయలేదని మంత్రి విమర్శించారు. సిబ్బంది, ఉద్యోగులకు ఇబ్బంది లేకుండా ఆర్టీసీని ప్రక్షాళన చేస్తామని, ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెడతామని మంత్రి తెలిపారు.

---------------------------

కేంద్రం విభజన హామీల అమలు చేసేలా ఉభయ తెలుగు రాష్ట్రాలు కలిసి కృషి చేయాలని తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్న ప్రభాకర్ అన్నారు. నిన్న తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని మంత్రి దర్శించుకున్నారు. అనంతరం మంత్రి ఆలయం వెలుపల పాత్రికేయులతో మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. గతంలో మాదిరిగానే తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖపై దర్శనం కల్పించే విధానం తిరిగి అమలు చేయాలని టిటిడికి విజ్ఞప్తి చేశామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఈ రోజు జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల ప్రాణాలను కాపాడడానికి వైద్యులు చేస్తున్న కృషిని గుర్తించడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. ప్రముఖ వైద్యులు పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, భారత రత్న డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ జయంతి, వర్ధంతి కూడా అయిన జులై 1వ తేదీన ప్రతి ఏటా జాతీయ వైద్యుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. 1882వ సంవత్సరం జులై 1వ తేదీన జన్మించిన ఆయన... వైద్య రంగాభివృద్ధికి, పేదలకు వైద్యం అందించడానికి కృషి చేశారు. అనేక వైద్య

సంస్థల ఏర్పాటులో కీలక భూమిక పోషించారు. 1962 జూలై 1వ తేదీన ఆయన తుది శ్వాస విడిచారు. కాగా... జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమం ఈరోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

దేశ న్యాయవ్యవస్థలో సమూల మార్పులు రావాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో నిన్న 'ఫోరం ఫర్ నేషనలిస్ట్ థింకర్స్' ఆధ్వర్యంలో కొత్త నేర న్యాయ చట్టాలపై కార్యశాల ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన కిషన్‌రెడ్డి కొత్త చట్టాల సారాంశంతో భరత్ గోగియా రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ, దేశ ప్రజలకోసం, సమాజ హితం కోసం కేంద్రం కొత్త నేర న్యాయ చట్టాలను తీసుకొచ్చిందన్నారు. దేశంలో వస్తున్న మార్పులు, కొత్తగా నమోదవుతున్న నేరాలు, ప్రజల ఆలోచనా విధానానికి అనుగుణంగా చట్టాలు రావాల్సిన అవసరముందని అన్నారు. నేర న్యాయ చట్టాల విషయంలో అనేక రంగాల వారి నుంచి వేల అభిప్రాయాలు స్వీకరించి.. కమిటీ ఏర్పాటు చేశామని, ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారమే కొత్త చట్టాలు రూపొందించాయని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య కలెక్టర్లు వారధిల పనిచేస్తారని తెలంగాణ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. నిన్న ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్‌లో అయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిరాన్ని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, పాలన నిర్ణయాల ద్వారా ప్రజలకు మేలు జరిగే విషయంలో జిల్లా కలెక్టర్లు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు.

---------------------------

వాయువ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమైన ఆవర్తనం ప్రభావంతో ఉత్తర ఒడిశా తీరం వద్ద వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. మరో రెండురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. బంగాళాఖాతంలో ఏరర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఈరోజు, రేపు తెలంగాణలో వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పలు జిల్లాలకు పసుపు రంగు హెచ్చరికను జారీ చేసింది. కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, ఖమ్మం,కొత్తగూడెం, వికారాబాద్ సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

---------------------------

తెలంగాణలో స్మార్ట్ సిటీ మిషన్ గడువును కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. ప్రస్తుతం వరంగల్, కరీంనగర్ నగరాల్లో ఈ పథకం పనులు కొనసాగుతున్న నేపథ్యంలో గడువు పొడిగించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రానికి విజ్ఞప్తి చేశారని, దీంతో పథకం గడువును 2025 మార్చి వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వం ఎన్నికల ముందు జారీ చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో 6 వేల 100 పోస్టులతో విడుదల చేసిన ప్రకటనని రద్దు చేస్తూ నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే 16 వేల 347 పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వనున్న క్రమంలో గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో మెగా డీఎస్సీ నిర్వహించనున్న నేపథ్యంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష –టెట్ కు ప్రభుత్వం ఈరోజు నోటిఫికేషన్ విడుదల చేయనుంది. పాఠశాల విద్యాశాఖ www.cse.ap.gov.in వెబ్‌సైట్‌లో దీనికి సంబంధించిన పూర్తి వివరాలను అందుబాటులో ఉంచనున్నట్లు ఆ శాఖ కమిషనర్ సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

======================